www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 24 ఆగస్టు 2025

5



డాక్టర్ బిఆర్.అంబేద్కర్

కోనసీమ

హెచ్‌ఎంవి డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - అమలాపురం

ఎస్‌సి సామాజికవర్గానికి చెందిన అభ్యర్థులకు హెవీ మోటార్ వెహికల్ (హెచ్‌ఎంవి) ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఎస్‌సి కార్పొరేషన్ ఇడి జె.సత్యవతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 వరకూ శిక్షణ పొందేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. జిల్లాకు చెందిన ఎస్‌సి సామాజికవర్గాలకు చెందిన ఐదుగురు పురుషులు, ఐదుగురు మహిళలకు ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు 10 మంది అభ్యర్థులకు శిక్షణ ఇవ్వాలని లక్ష్యాలను నిర్దేశించిందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు 20 సంవత్సరాల పైబడిన, కనీసం 1 సంవత్సరం కాలపరిమితి గల లైట్ మోటార్ వెహికల్ (ఎల్‌ఎంవి) లైసెన్స్ కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుతోపాటు విద్యార్హత, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను జత చేయాలన్నారు. కుల ధృవీకరణ పత్రం తప్పనిసరిగా జత చేయాలని కోరారు.

నిరాశ పరిచిన సిఎం పర్యటన

సమస్యలను విస్మరించిన చంద్రబాబు
ఏలేరు ఆధునికీకరణ ఊసెత్తని వైనం

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి, సామర్లకోట

పెద్దాపురంలో శనివారం నిర్వహించిన సిఎం పర్యటన జిల్లా ప్రజలను నిరుత్సాహ పరిచింది. ఈ పర్యటనలో ప్రజా సమస్యల ప్రస్తావన ఎక్కడా రాలేదు. కనీసం జిల్లా ప్రధాన సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపైనా ఆయన పెదవి విప్పలేదు. ఏలేరు ఆధునికీకరణ, సుద్దగడ్డ కాలువ పనులు, అతివృష్టి, అనావృష్టికి అన్నదాతలకు కలిగిన నష్టపరిహారం వంటి ప్రస్తావనలు ఎక్కడా లేవు. కాకినాడ స్మార్ట్ సిటీ ముంపు సమస్య పరిష్కారానికి చర్యలు, సెజ్‌లో పరిశ్రమల ఏర్పాటు వంటి దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ఆశించిన జిల్లా వాసులకు అసంతృప్తే మిగిలింది. ముఖ్యమంత్రిగా పదవి చేపట్టి ఏడాదిన్నరలో రెండోసారి చంద్రబాబు జిల్లాలో అధికారికంగా పర్యటించారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర, ప్రజా వేదిక కార్యక్రమాల్లో ఆయన ప్రసంగించారు. అనంతరం జరిగిన ర్యాలీలో పాల్గొన్నారు. పి4లో భాగంగా ఎంపిక చేసిన బంగారు కుటుంబాలను మార్గదర్శకులకు అప్పగించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. సుమారు గంట ప్రసంగంలో ముఖ్యమంత్రి పూర్తిగా సూపర్ సిక్స్, పి4, రూ.330 కోట్లతో వేస్ట్ ఎనర్జీ విధానం వంటి అంశాలకే ప్రాధాన్యతనిచ్చారు.



ర్యాలీలో పాల్గొన్న సిఎం చంద్రబాబు తదితరులు

ఏలేరు ఆధునికీకరణ మాట మరిచారు

ఏలేరు ఆధునికీకరణ లేకపోవడంతో ఈ జిల్లాలో 5 మండలాలకు చెందిన సుమారు 50 వేల మంది రైతాంగం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వరదల కారణంగా కాలువలు గండ్లు పడి పంటలను ముంచెత్తుతున్నాయి. అధ్వానంగా ఉన్న కాలువలను తాత్కాలిక పద్ధతిలో క్లోజర్ పనులు చేసినప్పటికీ అన్నదాతలకు అక్కరకు రాకుండా పోతున్నాయి. ఈ నేపథ్యంలో ఏలేరు ఆధునీకరణకు నిధులను కేటాయించాల్సి ఉంది. గతేడాది సెప్టెంబర్‌లో చంద్రబాబు మొదటిసారి ఈ జిల్లాకు వచ్చారు. స్వయంగా ఏలేరు రైతుల కష్టాలను వరద ప్రభావిత ప్రాంతాల్లో తిరిగి చూశారు. ఆ సందర్భంలో రైతాంగానికి ఆదుకుంటామంటూ హామీలు ఇచ్చారు. కానీ అధికారం చేపట్టి ఏడాదిన్నర కావొస్తున్నా ఈ ప్రాజెక్టు ఆధునికీకరణ ఊసెత్తలేదు. పెద్దాపురం సభలోనైనా ఆధునికీకరణ కోసం మాట్లాడతారని రైతులంతా ఎదురు చూశారు. కానీ చంద్రబాబు ప్రసంగం నిరాశ పరచడంతో వారు పెదవి విరిచారు. సుద్దగడ్డ కాలువ విషయంలోనూ ఇలాగే వ్యవహరించారు. సంపద సృష్టి కోసం మాట్లాడారు కాని సెజ్‌లో పరిశ్రమల స్థాపనపై పెదవి విప్పలేదు.


వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టును పరిశీలిస్తున్న సిఎం చంద్రబాబు

పెద్దాపురానికి పాత హామీలే...

2014 నుంచి 19 వరకు పాలించిన టిడిపి హయాంలో పెద్దాపురం ఎంఎల్ఎ చినరాజప్ప హోమ్ మంత్రిగా ఉన్నారు. అప్పట్లో ఆయన పెద్దాపురం సిహెచ్‌సిగా సేవలందిస్తున్న ఆసుపత్రిని 100 పడకల ఏరియా ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. తాజాగా మరోసారి 100 పడకల ఆసుపత్రి ప్రతిపాదనను ఎంఎల్ఎ రాజప్ప చంద్రబాబు ముందు ఉంచారు. దీంతో ఆయన ప్రైవేటు భాగస్వామ్యంతో ఆసుపత్రి అభివృద్ధి చర్యలు తీసుకుంటామని సభలో మరోసారి హామీ ఇచ్చారు. పెద్దాపురం, సామర్లకోట పట్టణాలకు రూ.75 కోట్లతో ప్రజలకు ఇంటింటా కుళాయిలు ఏర్పాటు ద్వారా రక్షిత త్రాగునీరు అందించేందుకు కృషి చేస్తామని చంద్రబాబు తెలిపారు. సామర్లకోటలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు కొత్త పథకం

మున్సిపల్ కార్మికులు, వారి కుటుంబాలకు సంక్షేమం, భద్రత అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. పెద్దాపురం సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు పారిశుధ్య కార్మికుల సంక్షేమం కోసం ప్రమాద, ఆరోగ్య బీమా స్కీమును ప్రారంభించారు. పట్టణాభివృద్ధి శాఖ, యాక్సిస్ బ్యాంక్ సంయుక్తంగా ఈ స్కీమును అమలు చేసేలా ఒప్పందం కుదిరింది. ఈ మేరకు ఇప్పటికే మున్సిపల్ కార్మికుల శాలరీ ప్యాకేజ్ ఖాతాలు ప్రారంభించారు. ఈ కొత్త ఆర్థిక సదుపాయం ద్వారా మున్సిపల్ కార్మికులకు గణనీయమైన భరోసా లభించనుంది. ప్రస్తుతం రాష్ట్రంలోని 123 అర్బన్ లోకల్ బాడీలలో మొత్తం 55,686 మంది కార్మికులు సేవలందిస్తున్నారు. ఇప్పుడు ఈ స్కీమ్ ద్వారా వీరందరికీ ఈ బీమా సదుపాయం లభించనుంది. వీరిలో 39,170 మంది పబ్లిక్ హెల్త్ విభాగంలో ఉండగా, 16,516 మంది ఇతర విభాగాల్లో పని చేస్తున్నారు. వీరిలో శాశ్వత, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ విధానంలో పని చేస్తున్న వారందరికీ ఈ పథకం వర్తించనుంది. ఇప్పుడు యాక్సిస్ బ్యాంక్‌తో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందం ద్వారా ఈ ప్రయోజనాలు మరింత విస్తృతమవుతాయి. శాశ్వత ఉద్యోగులకు ఒక రూ.1 కోటి వరకు ప్రమాద బీమా, రూ.పది లక్షల లైఫ్ కవర్ లభించనుంది. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రూ.20 లక్షల ప్రమాద బీమా, రూ.2 లక్షల లైఫ్ కవర్ సదుపాయం ఉంటుంది. కుటుంబ సభ్యులతో కలిపి మొత్తం రూ. 33 లక్షల వరకు ఆరోగ్య బీమా వర్తిస్తుంది. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులు వైవి.సత్యనారాయణ, ఎం.దుర్గలను సిఎం సత్కరించారు.

సిఎం చంద్రబాబుకు ఘన స్వాగతం

ముఖ్యమంత్రి చంద్రబాబుకు హెలిప్యాడ్ వద్ద ఘన స్వాగతం లభించింది. పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి, పి.నారాయణ, కార్మిక శాఖ మంత్రి వి.సుభాష్, ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, ఎంపీలు సానా సతీష్‌బాబు, తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, జిల్లా ప్రత్యేకాధికారి జి.వీరపాండ్యన్, కలెక్టర్ షన్‌మోహన్ సగిలి, ఎస్‌పి జి.బిందుమాధవ్, ఎంఎల్‌ఎలు యనమల దివ్య, డి.సుబ్బరాజు, జ్యోతుల నెహ్రూ, వనమాడి వెంకటేశ్వరరావు, వి.సత్యప్రభ, పంతం నానాజీ, ఎన్.రామకృష్ణారెడ్డి, ఎంఎల్‌సి పి.రాజశేఖర్, కర్రి పద్మశ్రీ ఉన్నారు.



అధ్యక్ష తరహా పాలనకు బిజెపి కుట్ర

ప్రశ్నార్థకంగా ఎలక్షన్ కమిషన్ స్వతంత్రత
సెమినార్‌లో అర్థశాస్త్ర నిపుణులు రాంభూపాల్

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం ప్రతినిధి

దేశంలో అధ్యక్ష తరహా పాలనను తీసుకొచ్చే కుట్రలో భాగంగానే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ బద్ధంగా ఏర్పాటైన స్వతంత్ర వ్యవస్థలను ఒక్కొక్కటిగా నిర్వీర్యం చేస్తుందని అర్థశాస్త్ర నిపుణులు వి.రాంభూపాల్ అన్నారు. తూర్పు గోదారి జిల్లా రాజమహేంద్రవరంలో 'రాజమహేంద్రి ఆలోచన వేదిక' ఆధ్వర్యంలో 'భారత ప్రజాస్వామ్యం – ఎన్నికల కమిషన్ స్వతంత్రత' అనే అంశంపై సంహిత డిగ్రీ కళాశాల ఆవరణలో శనివారం సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ ఉపాధ్యాయులు భీమయ్య అధ్యక్షత వహించారు. ముఖ్యవక్తగా రాంభూపాల్ హాజరై మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో లోపాలున్నప్పటికీ దీనిని సరిచేసుకుని పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడం పౌరుల కర్తవ్యం కావాలన్నారు. పార్టీల వారీగా దామాషా ఓటింగ్ విధానం అమలైతే ఎన్నికల నేపథ్యంలో జరుగుతున్న అవినీతి అక్రమాలకు అడ్డుకట్ట వేయొచ్చని తెలిపారు. రాష్ట్రంలో కొద్ది మంది ఎంఎల్ఎల అవినీతి అక్రమాలను ఈ సందర్భంగా ప్రస్తావించారు.

దేశవ్యాప్తంగా ఎలక్షన్ కమిషన్ తీరుపై చర్చ నడుస్తుందన్నారు. బీహార్, మహదేవపురంలో ఓటర్ల మార్పులు చేర్పులు ఆ వ్యవస్థ విశ్వసనీయతను ప్రశ్నిస్తున్నాయన్నారు. గత 11 ఏళ్లలో 12 రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో బిజెపి ఓడిపోయినప్పటికీ ప్రభుత్వాలను కూల్చి అధికారం చేపట్టిందని తెలిపారు. అయినా ఇసి జోక్యం చేసుకున్న దాఖలాలు లేవన్నారు. బీహార్ ఓటర్ల జాబితా నుంచి సుమారు 65 లక్షల మంది ఓటర్ల తొలగింపు, మహదేవపురంలో లక్షకు పైగా అక్రమంగా ఓట్లు చేర్పు వంటి పరిణామాలు బిజెపి రాజకీయ లక్ష్యం నెరవేర్చడానికి ఇసి దోహద పడిందనే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయన్నారు. మరోవైపు బిజెపి ప్రధాన అజెండాలో భాగమైన ఎన్ఆర్‌సి, సిఎఎలను ఎస్ఐఆర్ పేరుతో దొడ్డిదారిన అమలు చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాన్ని తెలిపారు. దేశంలో అత్యధిక మంది జనాభాను ప్రవాసీలుగా చూపి మతతత్వ అజెండా అమలు చేసేందుకు యత్నిస్తున్నారన్నారు. రాజకీయ వ్యవస్థను ప్రణాళిక బద్ధంగా నిర్వీర్యం చేయడానికి బిజెపి ప్రభుత్వం నయా ఫాసిస్టు విధానాన్ని అమలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం ఆలోచన వేదిక కన్వీనర్ పిఎస్ఎన్.రాజు, నగర ప్రజలు, పలు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న రాంభూపాల్

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - అమలాపురం

అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి.బేబిరాణి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో యూనియన్ జిల్లా కమిటీ సమావేశం బి.వెంకటలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలోని అన్ని సెక్టార్ల కమిటీలు వేయాలని, ప్రాజెక్ట్ మహాసభలు తక్షణమే జరపాలని, సెప్టెంబర్ 10వ తేదీ నాటికి ప్రాజెక్ట్ మహాసభలో పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. సభ్యత్వం, కార్మికలోకం ప్రతి సెంటర్‌కి వెళ్ళేటట్టుగా బాధ్యత తీసుకోవాలని, త్రిఫ్ట్ సొసైటీలో సభ్యులుగా అందర్నీ చేర్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం యాప్‌లో ఆన్‌లైన్ వరకు తగ్గించాలని, మొబైల్ ఫోను ట్యాబ్‌లో ఇవ్వాలని, అప్పటి వరకూ ఆన్‌లైన్ పనులు చేయకూడదని సంఘం నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నెల 25న ప్రభుత్వంలో చర్చలు జరుగుతున్న సందర్భంగా వేతనాలు పెంచాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచబోతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వెంకటలక్ష్మి, జిల్లా కార్యదర్శి కృష్ణవేణి, జిల్లాకమిటి సభ్యులు వెంకటలక్ష్మి, సుజాత, రాణి, రత్నకుమారి, మహేశ్వరి, దుర్గమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు వరద కష్టాలు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

గోదావరి వరద ఉధృతంగా ప్రవహిస్తుండటంతో విద్యార్థులకు వరద కష్టాలు తప్పడం లేదు. గత రెండు రోజులుగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో మండలంలోని లంక ఆఫ్ ఠాన్‌లంక, కూనలంక, గురజాపులంక, కమిని లంక ప్రాంతాలు నీట మునిగాయి. లంక గ్రామాల వాసులు బయటకు రావాలంటే వరద నీటిలో రావాల్సిందే. ఇక చదువు కోసం వచ్చే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు మోకాలు లోతు నీటిలోనే వెళ్ళాల్సిన పరిస్థితులు నెలకున్నాయి. ఈ పరిస్థితుల్లో తల్లిదండ్రులు స్కూల్‌కి వెళ్లే విద్యార్థులకు రక్షణ కవచంగా ఉండి, మోకాళ్ళ లోతు నీటిలోనే పిల్లలను స్కూల్‌కి పంపుతున్నారు. విద్యార్థులకు ప్రతి యేటా వరద సమయంలో వరద కష్టాలు నిత్యకృత్యంగా మారాయని ముంపు ప్రాంత వాసులు వాపోతున్నారు.

ప్రత్యేక వైద్య శిబిరాలు

అప్పనపల్లి, పాశర్లపూడి శివారు శ్రీరామపేట, పెదపట్నం గ్రామాలలో నగరం, లూటుకుర్రు పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ జాన్ లెవీ, డాక్టర్ కె.సత్యవతి ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ శిబిరాల్లో పలువురికి వైద్య సేవలందించి మందులు అందజేశారు.


విద్యార్థులను స్కూల్స్‌కు తీసుకెళ్తున్న తల్లిదండ్రులు

డిప్యూటీ ఎంపిడిఒ మంగాదేవి ఆకస్మిక మృతి

ప్రజాశక్తి - అమలాపురం రూరల్



అమలాపురం డిప్యూటీ ఎంపిడిఒగా విధులు నిర్వర్తిస్తున్న బడుగు మంగాదేవి శనివారం అనారోగ్యంతో ఆకస్మికంగా మృతి చెందారు. ఇటీవల ఆమె తీవ్ర అస్వస్థతకు గురవడంతో మెరుగైన చికిత్స కోసం కాకినాడ మెడికవర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె ఆరోగ్యం విషమించి శనివారం తుది శ్వాస విడిచారు. పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగ జీవితం ప్రారంభించిన ఆమె డిప్యూటీ ఎంపిడిఒ స్థాయికి వచ్చారు. ఆమె ఆకస్మిక మరణంతో ఉద్యోగులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. గతంలో మల్కిపురం గ్రామపంచా యతీల విస్తరణ అధికారిగా పని చేశారు. అక్కడి కార్యాలయ సిబ్బంది, ఎంపిపి మేడిచర్ల వెంకట సత్యవాణి ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

వైద్యం కోసం ఆర్థిక సాయం

ప్రజాశక్తి - రాజోలు

లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న రావులపాలెం మండలం గోపాలపురం గ్రామానికి చెందిన ఈతకోట చిన్నబాబు వైద్య ఖర్చుల కోసం రాజోలుకు చెందిన గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి సేవాసంస్థ రూ.35 వేలు ఆర్థియ సాయాన్ని అందించింది. రాష్ట్ర నెట్ క్యాప్ మాజీ డైరెక్టర్ పాటి శివకుమార్ చేతుల మీదుగా శనివారం అందజేశామని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కట్టా భాస్కర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, గోపాలపురం టిడిపి గ్రామ అధ్యక్షులు అధికారి నాగేశ్వరరావు, సొసైటీ ఛైర్మన్ ఓదూరి శివ, తదితరులు పాల్గొన్నారు.

జడ్‌పిటిసి కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - రామచంద్రపురం

ఇటీవల మృతి చెందిన మండల జడ్‌పిటిసి మెర్నిడి వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను జడ్‌పి ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా జడ్‌పిటిసి చిత్రపటానికి ఆయన పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కె.గంగవరం, కాజులూరు, రాయవరం జడ్‌పిటిసిలు ఓబిలినేని వరలక్ష్మి, వనుము వెంకట సుబ్బారావు, నల్లమిల్లి మంగతాయారు, ఎంపిపి అంబటి భవాని పాల్గొన్నారు.

కన్నబాబును పరామర్శించిన నాయకులు

ప్రజాశక్తి - అయినవిల్లి

పితృవియోగంతో బాధపడుతున్న మాజీ మంత్రి కురసాల కన్నబాబును పలువురు పరామర్శించారు. కోనసీమకు చెందిన మాజీ మంత్రి పినిపే విశ్వరూప్, అంబాజీపేట మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా యువజన విభాగం మాజీ జనరల్ సెక్రెటరీ చేట్ల రామారావు, పి.గన్నవరం మండల విద్యార్థి విభాగం అధ్యక్షుడు కొండేటి సురేష్‌బాబు, వైసిపి సోషల్ మీడియా యాక్టివిస్ట్ మంద దుర్గారావు, రాయి నందా, యేలేటి వాసు కన్నబాబును కలిసి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

ఛాంపియన్ షిప్ కప్ పోటీలకు సత్య ఎంపిక

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

అమరావతి ఛాంపియన్ షిప్ కప్ పోటీలకు భీమనపల్లి జడ్‌పి ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థి దాసరి సత్య ఎంపికయింది. కాకినాడలో జరుగుతున్న జోనల్ స్థాయి పోటీలలో సత్య 800 మీటర్ల పరుగు పందెంలో తృతీయ స్థానం సాధించింది. ఈ సందర్భంగా శనివారం హెచ్‌ఎం ఎన్.సత్యనారాయణ, ఎస్ఎంసి ఛైర్మన్ జి.చిన్న, పీడీలు మధుసూదనరావు, ప్రసాద్, స్టాఫ్ సెక్రటరీ ఎన్.పద్మనాభన్, ఉపాధ్యాయులు సత్యను అభినందించారు.

పిహెచ్‌సి అభివృద్ధి కమిటీ సమావేశం

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండలంలోని అచ్యుతాపురం పిహెచ్‌సి అభివృద్ధి కమిటీ సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశంలో ఎంపిపి మేడిశెట్టి సత్యవేణి పాల్గొని ఆసుపత్రికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆమె వైద్యాధికారులను కోరారు. అనంతరం ఆసుపత్రి అభివృద్ధికి సంబంధించి పలు తీర్మానాలు చేశారు. ఈ సమావేశంలో సర్పంచులు ఆర్.సుజాత, కె.ఉదయ్‌శ్రీ, ఎంపిడిఒ జి.రాజేంద్రప్రసాద్, తహశీల్దార్ శ్రీనివాస్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

చదువు పట్ల ఆసక్తి అవసరం : కలెక్టర్

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

జిల్లాలో విద్యార్థులు చదువు పట్ల ఆసక్తిని పెంచుకోవాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సమనస మహాత్మ జ్యోతిరావు పూలే బిసి వెల్ఫేర్ బాలుర రెసిడెన్షియల్ స్కూల్‌ను ఆయన సందర్శించారు. విద్యార్థులతో తరగతి గదిలో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విపశ్యన ధ్యాన బోధన జిల్లాలో 8 ఆశ్రమ పాఠశాలలో మూడు నెలల పాటు నిర్వహించి సత్ఫలితాలను ఇస్తే తదుపరి అన్ని పాఠశాలలో దశలవారీగా యోగా భ్యాసన ప్రక్రియను నిర్వహిస్తామన్నారు. వేల సంవత్సరాల క్రితమే గౌతమ బుద్ధుడు కనుగొన్న ఒక ఆత్మ పరిశోధనా పద్ధతని అన్నారు. మనసులో ఉండే ఒత్తిడి, ఆందోళన, కోపం వంటివి తగ్గి ప్రశాంతత పెరుగుతుందన్నారు. ఈ విపశ్యన యోగ సాధన వల్ల విద్యార్థులలో క్రమేపి విద్య పట్ల ఆసక్తి, క్రమ శిక్షణ మెరుగుపడి కొంత మేర ప్రయోజనం చేకూరుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఇఒ షేక్ సలీం భాష, సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జి.మమ్మీ, యో గా నిపుణులు అమర్, తహశీల్దార్ అశోక్‌ప్రసాద్, పాఠశాల అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థితో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అప్పనపల్లి కాజ్‌వేను ఆధునికీకరించాలి

ప్రజాశక్తి - మామిడికుదురు

పాశర్లపూడి కరకట్ట దిగువన మూడు లంక గ్రామాలకు వెళ్లే ప్రధాన ఆర్ అండ్ బి రహదారిలో పాటు రేవులో ఉన్న కాజ్ వేను ఆధునికీకరించాలని పి.గన్నవరం నియోజకవర్గ వైసిపి కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శనివారం ఆయన అప్పనపల్లి కాజ్ వే వద్ద వరద పరిస్థితిని ఆయన పరిశీలించారు నీట మునుగుతున్న కాజ్ వే వల్ల పెదపట్నం లంక, బి.దొడ్డవరం, అప్పనపల్లి గ్రామాల ప్రజలు వరదల సమయంలో రవాణా వ్యవస్థ స్తంబించి త్రీవ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కాజ్ వే నిర్మాణం చేపట్టి శాశ్వత ముంపు నుంచి విముక్తి కల్పించాలని కోరారు. గత మూడు రోజులుగా వరద నీటిలో ఉన్న శ్రీరామపేట వాసులను ఆయన పరామర్శించారు ఈ పర్యటనలో ఎంపిటిసిల సమాఖ్య అధ్యక్షులు నెల్లి దుర్గాప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

అంతరిక్ష పరిశోధనలపై జిజ్ఞాస అవసరం

ప్రజాశక్తి - రాజోలు


అంతరిక్ష పరిశోదనలపై విద్యార్థులు జిజ్ఞాస అవసరమని వివేకానంద ఆంగ్లమాధ్యమ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ పివివి.వరప్రసాద్ అన్నారు మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురంలోని వివేకానంద పాఠశాలలో శనివారం జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 ఆగస్టు 23 చంద్రుని ఉపరితలంపై విక్రమ్ ల్యాండర్‌ను సురక్షితంగా ల్యాండింగ్‌ను సాధించామని అన్నారు భారతదేశం చంద్రునిపై దిగిన నాల్గవ దేశంగా గుర్తింపును పొందిందని తెలిపారు. ప్రతీ విద్యార్థి అంతరిక్ష పరిశోధనపై ఆసక్తిని కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయలు పాల్గొన్నారు.

తగ్గుముఖం పట్టిన వరద గోదావరి

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

నదీ పరివాహక ప్రాంతాల ప్రజలను గడగడలాడించిన వరద గోదావరి శనివారం తగ్గుముఖం పట్టింది. లంక పొలాల్లో అరటి, కొబ్బరి, కూరగాయల పంటలు ముంపు నీటిలో కొనసాగుతున్నాయి. కోరుమిల్లి లంక, పల్లపులంక, నారాయణలంక, పల్లపు ప్రాంతాల్లోని పంట పొలాలకు వరద నీరు చేరడంతో పంటలు పనికి రాకుండా పోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. లంక గ్రామాల్లో పర్యటిస్తున్న అధికారులు వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించి ప్రజలకు, రైతులకు, పలు సూచనలు చేస్తూ, అవగాహన కల్పిస్తున్నారు. ప్రజలకు వ్యాధుల ప్రబలకుండా మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ శ్రీనివాస్, ఎంపిడిఒ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

కార్టూ'నిజం'



వరి చేలలో డ్రోన్ ద్వారా స్ప్రేయింగ్

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని నర్సిపూడిలో ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో ప్రయోగాత్మకంగా డ్రోన్ ద్వారా పిచికారి చేసే విధానాన్ని ప్రారంభించారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ డివిజన్ అధికారి, మాస్టర్ ట్రైనర్ స్వర్ణలత రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టవలసిన ఆవశ్యకతను వివరించారు. ప్రస్తుత పరిస్థితులలో కావలసినన్ని ఆహార ధాన్యాలు ఉన్నా వాటిలో రసాయనిక పురుగు మందుల అవశేషాలు అధికంగా ఉండి అనారోగ్యం పాలు అవుతున్నారన్నారు. ప్రతి రైతు కొంత చేలో ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టి తన కుటుంబ వరకు ఎటువంటి రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడకుండా పండించిన ధాన్యాలు, కూరగాయలు, ఆకుకూరలు తినడంతో కుటుంబ ఆరోగ్యాన్ని కాపాడవచ్చని వివరించారు. ప్రకృతి వ్యవసాయం చేపట్టిన పలువురు రైతులు వారి అనుభవాలను ఇతర రైతులకు వివరించారు. క్లస్టర్ నేచురల్ ఫార్మింగ్ క్యాడర్ కర్రి సూర్యప్రకాశరావు మాట్లాడుతూ డ్రోన్ ఉపయోగించి పిచికారి చేయడంతో మనం వాడే పురుగుమందులు, ప్రకృతి కషాయాలు సమర్థవంతంగా పంట పొలానికి ఉపయోగపడి, సమయం కలిసి వస్తుందని అన్నారు. అనంతరం సుమారు 20 ఎకరాల వరి పొలాల్లో డ్రోన్ ద్వారా పిచికారి చేసి రైతులకు అవగాహన కల్పించారు. ఈ డ్రోన్లను ప్రభుత్వం 80 శాతం సబ్సిడీతో సరఫరా చేస్తుందని రైతులందరూ డ్రోన్ ద్వారా పిచికారి చేసుకోవడం అలవాటు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు మద్దిరెడ్డి వెంకటేశ్వర్లు, రెడ్డి సత్తియ్య, షేక్ రసూల్, వెలగదుర్తి నరసయ్య, గుత్తుల కొండ, తోరాటి నాగు, ఐసిటి డిజిటల్ నాగసూర్యవతి, ఐసిఆర్‌పిలు పాల్గొన్నారు.


డ్రోన్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

వినాయక ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి - యంత్రాంగం

ఆలమూరు వినాయక చవితి ఉత్సవాలను జరిపించే కమిటీలు తప్పనిసరిగా అధికారుల అనుమతులు తీసుకోవాలని ఆలమూరు ఎంపిడిఒ ఎ.రాజు, డిప్యూటీ తహశీల్దార్ సుబ్బరాజు అన్నారు. శనివారం మండల రెవెన్యూ కార్యాలయంలో ఉత్సవ కమిటీ సభ్యులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీసులకు ఆయా నిర్వాహణ కమిటీల పూర్తి వివరాలతో దరఖాస్తు అందజేసి అనుమతి తీసుకోవాలన్నారు. అలాగే విద్యుత్ చౌర్యానికి ఎవరు పాల్పడవద్దని, విద్యుత్ శాఖ నుంచి తాత్కాలిక అనుమతి పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎఇ దుర్గాప్రసాద్, ఇరిగేషన్ ఎఇ కృష్ణత్రిమూర్తులు, ఆర్ఐ రమాయమ్మ, వైద్య సిబ్బంది, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. **ముమ్మిడివరం** వినాయక చవితిని నిర్వహించే కమిటీలు నవరాత్రి ఉత్సవాలకు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని ముమ్మిడివరం ఎస్ఐ డి.జ్వాలాసాగర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సింగల్ విండో విధానంలో ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. అనుమతులు పొందడానికి ఎటువంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని, ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తర్వాత, మండప స్థలాన్ని పోలీస్ అధికారి తనిఖీ చేసి, నిబంధనల ప్రకారం ఉంటే క్యూ ఆర్ కోడ్‌తో కూడిన నిరభ్యంతర పత్రాన్ని జారీ చేస్తారన్నారు. **ఉప్పలగుప్తం** స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ విఎస్.దివాకర్ అధ్యక్షతన గణపతి ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎస్ఐ సిహెచ్.రాజేష్ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ కోసం గణపతి ఉత్సవాలు, నిమజ్జనాలు నిర్వహించేందుకు ముందుగా పోలీసులు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ భూపతిరాజు తులసికృష్ణ, ఇఒపిఆర్‌డి సిఆర్‌సి.రాజ్‌కుమార్, ఆర్ఐ నాగూర్ మీరాసాహెబ్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పేకాడుతున్న ఏడుగురు అరెస్ట్

ప్రజాశక్తి - గోపాలపురం

పేకాట శిబిరంపై దాడి చేసి ఏడుగురు వ్యక్తులను అరెస్ట్ చేశామని ఎస్ఐ పి.మనోహర్ తెలిపారు. మండలంలోని వాదాలకుంట గ్రామంలో పేకాట ఆడుతుండగా శనివారం దాడులు చేశామన్నారు. ఏడుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.50,170 నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని గాడిమొగ గ్రామానికి చెందిన సంగాడి హరికృష్ణ కనబడడం లేదని ఆయన సోదరుడు మధుబాబు కోరంగి పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపారు. హరికృష్ణ ఐటిఐ చదివి ప్రస్తుతం ఇంటివద్ద ఉంటున్నాడు. సుమారు 1 సంవత్సరం నుంచి హరికృష్ణ మానసిక పరిస్థితి బాగోలేనందున కాకినాడలోని జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ నెల 11న ఇంటి నుంచి కాకినాడ వెళుతున్నా అని చెప్పి బయటికి వెళ్లాడని, తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. హరికృష్ణ ఆచూకీ తెలిసినవారు సిఐ 9440796521కు, ఎస్ఐ 9440796558 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.


డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న ఎంపిడిఒ

డంపింగ్ యార్డు పరిశీలన

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - అయినవిల్లి

మండలంలోని సిరిపల్లి పంచాయతీకి చెందిన డంపింగ్ యార్డును ఎంపిడిఒ జి.సరోవరరావు పరిశీలించారు. ఈ నెల 18న 'డంపింగ్ యార్డులుగా రహదారులు' అని ప్రజలు పడుతున్న ఇబ్బందులపై ప్రజాశక్తి ప్రత్యేక కథనం ద్వారా వెలుగులోకి తెచ్చింది. దీనిపై స్పందించిన ఎంపిడిఒ జి.సరోవరరావు, డిప్యూటీ ఎంపిడిఒ వాణికుమారి బెహరా, పంచాయితీ కార్యదర్శి ఎ.ప్రసాద్‌తో కలిసి శనివారం డంపింగ్ యార్డ్‌ను పరిశీలించారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని డంపింగ్ చేసిన చెత్తను అక్కడ నుంచి తొలగించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు.


డీలర్లతో సమీక్షిస్తున్న తహశీల్దార్ శ్రీనివాస్

అవకతవకలు లేకుండా చర్యలు

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

గ్రామాల్లో నిర్వహించే రేషన్ పంపిణీలో డీలర్లు ఎటువంటి అవకతవకలు లేకుండా చర్యలు ఉండాలని తహశీల్దార్ జి.శ్రీనివాస్ ఆదేశించారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో రేషన్ డీలర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 65 సంవత్సరాల దాటిన వృద్ధులకు డోర్ డెలివరీపై అనేక ఫిర్యాదులు అందుతున్నాయని, అటువంటివి జరగకుండా చూడాలని ఆదేశించారు. రేషన్ షాపుల ద్వారా సక్రంగా రేషన్ పంపిణీ జరగాలని, 31వ తేదీ లోగా వృద్ధులకు, రేషన్ పంపిణీ పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాస్, మండల డీలర్లు పాల్గొన్నారు.


దాతకు చిత్రపటాన్ని అందిస్తున్న ఆలయ పూజారులు

నిత్య అన్నదాన నిధికి విరాళం

ప్రజాశక్తి - అయినవిల్లి

అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి నిత్య అన్నదాన నిధికి సికింద్రాబాద్‌కు చెందిన పనకజల శుష్లోక్ జై ధనుష్ కుటుంబ సభ్యులు రూ.10,116 విరాళాన్ని అందజేశారు. శనివారం విఘ్నేశ్వర స్వామిని దర్శించికుని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విరాళాన్ని ఆలయ ఇఒకి అందజేశారు. దాతను శేష వస్త్రాలతో సత్కరించి, స్వామి చిత్రపటాన్ని బహుకరించారు.

పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి వెంకన్న ఆలయానికి శనివారం యాత్రికులు పోటెత్తారు. ఏడు వారాలు నోమునోసి యాత్రికులతో ఆలయ మాడవీధులు నిండిపోయాయి. ఆలయ దక్షిణ, ఉత్తర ద్వారాలను వెడల్పు చేయడంతో యాత్రికులకు వెంకన్న దర్శనం సులభతరం అయింది. గతంలో ద్వారాలు ఇరుకుగా ఉండడంతో యాత్రికులు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఉత్తర, దక్షిణ సింహద్వారాలు వెడల్పు చేయడంతో యాత్రికులు సంతోషం వ్యక్తం చేశారు. సుమారు 70 వేల మంది యాత్రికులు వెకన్నను దర్శించుకున్నారు.

పట్టణంలో అన్నదానం

ప్రజాశక్తి - రామచంద్రపురం

ఎపిఐడిసి మాజీ డైరెక్టర్, ఎన్‌టిఆర్ సేవా సమితి గౌరవ అధ్యక్షులు వాసంశెట్టి శ్రీనివాస్‌కుమార్ పుట్టినరోజు సందర్భంగా పట్టణంలో అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టిఆర్ సేవా సమితి అధ్యక్షుడు సాదే రాజేష్‌కుమార్, వైసిపి ఎస్‌సి సెల్ అధ్యక్షులు గుబ్బల శ్రీనివాస్ మాట్లాడారు. శ్యామ్ చేసిన సేవా కార్యక్రమాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సభ్యులు దడాల రవికుమార్, సమితి సభ్యులు నక్క నాగు, పిల్లి శ్రీను, బాపూజీ, సుబ్బారావు , వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వణికించిన వరద

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

గోదావరి వరద జిల్లా ప్రజలను వణికించింది. తగ్గుతూ పెరుగుతూ నానా తంటాలు పెట్టింది. మరోవైపు వాయుగుండం కారణంగా దంచికొట్టిన వర్షాలు ఉమ్మడి జిల్లాను ముద్దచేశాయి. గత నెల వరకూ అనావృష్టితో అల్లాడిన అన్నదాతలు ఈ నెల అతివృష్టితో అతలాకుతలమయ్యారు. ముసురుతో పంటలు ముంపునకు గురై ఇబ్బందులు పడ్డారు. అత్యధిక మండలాల్లో నాట్లు ముంపునకు గురయ్యాయి. రోజులతరబడి నీరు నిలిచిపోవటంతో రైతులకు నష్టాలు తప్పలేదు. మరోవైపు ఎరువుల కొరతతో అన్నదాతలు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. నేటికీ పలుప్రాంతాల్లో ఎరువుల కొరత ఇంకా కొనసాగుతూనే ఉంది. కొన్ని చోట్ల అధికారంలో ఉన్న సొసైటీ చైర్మన్లే నేరుగా వ్యవసాయాధికారులను కలిసి ఎరువు కొరత లేకుండా చూడాలంటూ వినతిపత్రాలను సైతం అందించారు. అయినప్పటికీ అధికారులు మాత్రం ఎరువుల కొరత లేదంటూ ప్రకటనలు గుప్పిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో మాత్రం రైతులు ఎరువుల కోసం రైతు భరోసాకేంద్రాలు, సొసైటీలు, ప్రయివేటు దుకాణాల చుట్టూ పడిగాపులు కాస్తునే ఉన్నారు.

కనీస పరామర్శ కరువు

వర్షాలు, వరదల నేపథ్యంలో నిర్వాసితులకు కూటమి నాయకులు పరామర్శ కూడా కరువైంది. పునరవాస కేంద్రాల్లో తలదాచుకుంటున్న వరద బాధితుల స్థితిగతుల గురించి తెలుసుకునే కనీస ప్రయత్నమూ వారు చేయకపోవడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. అధికారులు మాత్రం పునరావాస కేంద్రాలకు అడపా దడపా వెళ్లి వచ్చేశారు. రాజమహేంద్రవరంలో బ్రిడ్జి లంక వాసులు ఇంకా పునరావస కేంద్రంలోనే తలదాచుకున్నారు. మరో రెండు మూడు రోజులు వారు ఇక్కడే ఉండే పరిస్థితి నెలకొంది.

ఉచితం... అనుచితం

పిల్లితో చెలగాటం ఎలుకకు ప్రాణ సంకటం అన్న చందంగా ఉచిత బస్సు ప్రయాణం మారింది. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన స్త్రీ శక్తి పథకంలో డొల్లతనం తొలి వారంలోనే బట్టబయలైంది. కొన్ని బస్సులకే ఈ పథకాన్ని వర్తింపజేయడంపై మహిళల్లో వ్యతిరేకతన కనిపిస్తుంది. మరోవైపు ఆటోడ్రైవర్ల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుంది. అత్యధిక మంది యువత రవాణారంగంపై ఆధార పడి ఉపాధిపొందుతున్నారు. ఆటో, ట్యాక్సీ డ్రైవర్లుగా జీవనం సాగిస్తున్నారు. గడిచిన వారం రోజులుగా ఆటో డ్రైవర్ల పరిస్థితి దయనీయంగా మారింది. రోజంతా కష్టం చేసినా ఆయిల్ ఖర్చులు పోనూ కూలి కూడా గిట్టుబాటు కావటం లేదని వాపోతున్నారు. పట్టణాల్లో పరిస్థితి కొంత



మెరుగుగా ఉన్నప్పటికీ పల్లెలో ఆటో డ్రైవర్లు ప్రత్యామ్నాయం వైపు చూడక తప్పేలా లేదు.

బార్‌లు బార్లా.

కూటమి ప్రభుత్వం మద్యాన్నే ప్రధాన వనరుగా మలుచుకుంటుంది. అందులో భాగంగా కొత్తగా బార్‌లకు అనుమతులిచ్చింది. అందే కాకుండా బార్‌ల పని గంటలను అర్ధరాత్రి 12 గంటల వరకూ పెంచింది. ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా విమర్శలు విన్పిస్తున్నాయి. సంపద సృష్టిస్తామంటూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ఇదేనా? అంటూ ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే పర్మిట్ రూమ్‌ల వల్ల మద్యం వ్యాపారం ఒక్కసారిగా పెరిగింది. తాజా నిర్ణయంతో ఇక మద్యం ఏరులై పారనుంది.

వికలాంగులకు పింఛన్ ఎగనామం

వికలాంగులకు ఆసరా కోసం అందించే పింఛన్లకు సైతం కూటమి ప్రభుత్వం ఎగనామం పెట్టడం సర్వత్రా విమర్శలు విన్పిస్తున్నాయి. అధికారంలోకొచ్చిన తొలి ఏడాదిలోనే పింఛన్లు పెంచామంటూ ప్రకటనలు గుప్పించిన ప్రభుత్వం ఆచరణలోపూర్తి భిన్నంగా వ్యవహరిస్తోంది. అధికారంలోకివచ్చి 14 నెలలు గడిచినా స్పౌజ్ పింఛన్లు మినహా ఇతర ఎలాంటి పింఛన్లు కొత్తగా మంజూరు చేయలేదు. పైగా అనర్హత పేరుతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 8 వేల మంది వికలాంగ పింఛన్లను తొలగించింది. దీంతో వికలాంగులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. తాజా నిర్ణయంపై ప్రజా ప్రతినిధులు సైతం భాద్యతాయుతంగా స్పందించకపోవడం విమర్శలకు దారితీస్తుంది.

ఘనంగా ప్రకాశం పంతులు జయంతి

ప్రజాశక్తి - అమలాపురం, రాజోలు

కలెక్టరేట్‌లో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 54వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ కె.మాధవి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేతలు ఎంతమంది ఉన్నా, ప్రజాభిమానాన్ని చూరగొనేది మాత్రం కొందరేనని అన్నారు. అలాంటి కొద్దిమంది నేతల్లో టంగుటూరి ప్రకాశం పంతులు ఎన్నటికీ చిరస్థాయిగా, చిరస్మరణీయులుగా నిలుస్తారన్నారు. ప్రకాశం పంతులు ప్రజాసేవ, దేశభక్తి ఎప్పటికీ ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్‌లు నాగలక్ష్మమ్మ, ఏసుబాబు, రమణకుమారి, డిటి వంశీ, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మలికిపురం ఎంవిఎన్, జెఎస్, ఆర్‌విఆర్ డిగ్రీ కళాశాలలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కళాశాల ఛైర్మన్ రుద్రరాజు పద్మరాజు, ప్రిన్సిపల్ ఎస్.ఆనందమహనీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా రాష్ట్ర ప్రగతికి బాటలు వేసిన ప్రకాశం పంతులు దేశభక్తుడని, ఆయన సేవలను స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ చిట్టాల సత్యనారాయణ, పీడీ పిడికె.ప్రసాద్, ఐక్యూ ఎసి కోఆర్డినేటర్ పి.సూర్యనారాయణరాజు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎన్.రమేష్ బాబు, పాల్గొన్నారు.

డిఎస్‌సిలో అమ్మిరాజుకు 3వ ర్యాంకు

ప్రజాశక్తి - రామచంద్రపురం

డిఎస్‌సి మెరిట్ జాబితాలో మోడరన్ జూనియర్ కాలేజీ ఫిజిక్స్ లెక్చరర్ చల్లా శివఅమ్మిరాజు ఫిజికల్ సైన్స్ విభాగంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 3వ స్థానాన్ని కైవసం చేసుకున్నారని మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయన్ జివి.రావు తెలిపారు. ఈ సందర్భంగా శివను శనివారం కాలేజీ ప్రాంగణంలో విజేతను అభినందించారు. విజేతను అకాడమిక్ డైరెక్టర్స్ కె.సాయిరాం చౌదరి, ఎ.రమాదేవి, ఆర్.ఉమాదేవి, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ సిహెచ్.రాజేష్, వైస్ ప్రిన్సిపల్ పిఎస్.ప్రకాష్, అకాడమిక్ అడ్వైజర్ సిహెచ్.శ్రీనివాస్ సిబ్బంది అభినందనలు తెలిపారు.


శివఅమ్మిరాజును అభినందిస్తున్న జివి.రావు

అన్న క్యాంటీన్‌లో రుచికరమైన భోజనం

ప్రజాశక్తి - మండపేట

రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌లలో రుచికరమైన భోజనాన్ని అందిస్తున్నట్లు రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్‌ఎ వేగుళ్ళ జోగేశ్వరావు అన్నారు. శనివారం ఏడిద రోడ్‌లోని అన్న క్యాంటీన్‌ను ఆయన పరిశీలించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి, మాజీ ఛైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, కమిషనర్ టివి.రంగారావులతో కలిసి అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. అన్నం భుజించడానికి వచ్చిన వారితో ఆయన మాట్లాడారు. రూ.5 కే నాణ్యమైన భోజనం అందిస్తున్నారని అన్నారు. సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ప్రతిష్టాత్మకంగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నారని అన్నారు. ఈ పర్యటనలో డిఇ కె.శ్రీనివాస్, మేనేజర్ బి.రవికిరణ్, ఎఇలు డి.పవన్‌కుమార్, కె.అనూషలక్ష్మి, రెవెన్యూ ఆఫీసర్ జెవిఎస్.శాస్త్రీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.సత్తిరాజు, తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీత వీర్రాజుచౌదరికి సత్కారం

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని చింతలూరు నూకాంబిక అమ్మ వారి దేవస్థానం ప్రాంగణంలో కార్యనిర్వహణాధికారి ఉండవల్లి వీర్రాజుచౌదరిని శనివారం గ్రామ పెద్దలు సత్కరించారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలో ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో ఆయనను పలువురు ప్రశంసించారు. చింతలూరు దేవస్థానం ఆలయ అభివద్ధికి ఇఒ చేసిన కృషిని అభినందించారు. ఈ సందర్భంగా ఇఒ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి సహకారాన్ని అందించి అహర్నిశలు కృషి చేస్తున్న గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర, దేశ, ఇతర దేశాలకు చెందిన ఎందరో దాతలు ఉన్నారని అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గన్ని వెంకట్రావు, పెద్దింటి కాశి, వైట్ల గంగరాజు, పాల్గొన్నారు.

మట్టి ప్రతిమలకు ప్రాధాన్యత

ప్రజాశక్తి - రామచంద్రపురం

వినాయక చవితి సందర్భంగా ప్రకతిని పరిరక్షించేలా మట్టి వినాయకుల ప్రతిమలకు ప్రాధాన్యత ఇవ్వాలని ద్రాక్షారామ జడ్‌పి స్కూల్ హెచ్‌ఎం జి.శేఖర్ అన్నారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో లవ్ టు సెర్వ్ అనే స్వచ్ఛంద సంస్థ మట్టి వినాయక ప్రతిమల పోటీలు నిర్వహించింది. వాటిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల్ని అందజేశారు. పాఠశాల పని గంటల అనంతరం జరిగిన ఈ పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వివిధ రకాల వినాయక ప్రతిమలను మట్టితో తయారు చేశారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానం యు.మణికంఠ, ద్వితీయ స్థానం జి.జీవన్‌కుమార్, తృతీయ స్థానం జి.వైష్ణవి గెలుపొందారు. లవ్ టు సెర్వ్ సంస్థ ప్రతినిధి సమయపంతుల సాయిగణేష్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సేవాగుణాన్ని పెంచటం, ప్రకృతిని పరిరక్షించాలని భావనతో ఈ పోటీలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ అరవవిస్సు, జి ఉమాపతి, ఆని శ్రీనివాస్, ఉమా, కోడి ప్రసాద్, పాల్గొన్నారు.

బాలికల ఉన్నత పాఠశాల పరిశీలన

ప్రజాశక్తి - ఆలమూరు


పాఠశాలను పరిశీలిస్తున్న ఎంపిడిఒ రాజు

స్థానిక జడ్‌పి బాలికల ఉన్నత పాఠశాలను ఎంపిడిఒ ఎ.రాజు శనివారం పరిశీలించారు. విద్యార్థులకు మౌలిక సదుపాయాల కల్పన, తరగతి గదులలో విద్య బోధనలకు కావలసిన సదుపాయాలు, మధ్యాహ్న భోజన సదుపాయాలపై ఆరా తీశారు. విద్యాబోధన, వంటకాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. పరిశుభ్రతపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ అప్పాజీ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వంట షెడ్ నిర్మాణ పనులకు భూమి పూజ

ప్రజాశక్తి - అయినవిల్లి

మండలంలోని నేదునూరు పెదపేట ఎంపియుపి పాఠశాలలో దాత, ఎంపిటిసి సభ్యులు ఇండుగుల వెంకటరామయ్య ఆర్థిక సహకారంతో వంట షెడ్డు నిర్మాణానికి శనివారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసిలు గుమ్మడి వెంకటేశ్వరరావు, సుబ్బరాజు, ఎంఇఒ పి.శ్రీనివాసరావు, ఎస్ఎంసి ఛైర్మన్ జె.నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

నన్నయ యూనివర్సిటీ విడుదల చేసిన డిగ్రీ 4వ సెమిస్టర్ ఫలితాలలో స్థానిక వెంకటేశ్వర డిగ్రీ కళాశాలకు చెందిన కె.గాయత్రి జ్యోతి 9.5 గ్రేడ్‌తో ప్రథమ స్థానం, ఆర్.దేవిశ్రీ, కె.సందీప్ 2వ స్థానాన్ని, ఎస్ఆర్.శైలు 9.25 గ్రేడ్‌తో మూడో స్థానాన్నికైవసం చేసుకున్నారు. 42 మంది విద్యార్థులకు 9.0 పైన గ్రేడ్‌తో ఉత్తీర్ణత సాధించారని కళాశాల కరస్పాండెంట్ కెవిఆర్ఎన్.నరసింహారావు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపల్ కె.మనోహర్, ఉపాధ్యాయులు అభినందించారు.

వెయిట్ లిఫ్టర్ ఇందిరకు అభినందన

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం


ఇందిరను అభినందిస్తున్న హెచ్‌ఎం కనకదుర్గా

వెయిట్ లిఫ్టింగ్‌లో ఉత్తమ ప్రతిభను చాటుకున్న గొల్లవిల్లి జడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థిని యనమదల ఇందిరను పలువురు అభినందించారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న క్రీడోత్సవాల్లో ఆమె 75 కెజిల వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో జోన్-2 నుంచి ఇందిర సిల్వర్ మెడల్ సాధించింది. ఈనెల 24, 25, 26 తేదీలలో తిరుపతిలో జరగనున్న రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఆమె పాల్గొననుంది. ఈ సందర్భంగా శనివారం ఆ పాఠశాలలో ఇందిరను హెచ్‌ఎం జి.కనకదుర్గ, ఎస్ఎంసి ఛైర్మన్ వాలా సత్యనారాయణ, పిఇటిలు అభినందించారు.